# దేహాభిమానమును త్యజించి దైవాభిమానమును పెంచుకోండి!

## If you look to Me, I will look to you

(మీరు నావైపు చూసినయెడల నేను మీవైపు చూసెదను)

కర్మమున పుట్టు జంతువు
కర్మముననె వృద్ధి పొంది కర్మమున చనున్
కర్మమె నరునకు దైవము
కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలోన్

ప్రేమస్వరూపులారా! ప్రతి మానవుడు తాను ఆరోగ్యముగానే ఉన్నట్లు భావించి, తన జీవితాన్ని ఆనందముగా గడపాలని ప్రయత్నిస్తుంటాడు. కాని, తనయందున్న వాతపిత్త శ్లేష్మాదులను తాను సరియైన స్థితిలో పోషించుకో లేకపోవడంచేత మానవుణ్ణి అనేకవిధములైన రోగములు వెంటాడుచున్నవి. వాతపిత్తశ్లేష్మాదులను సరియైన స్థితిలో ఉంచుకొని, ఆత్మాభిమానమును పోషించుకున్నప్పుడే మానవుడు ఆరోగ్యవంతునిగా రూపొందగలడు. కాని, మానవుడు ఆత్మతత్త్వమును విస్మరించి దేహాభిమానమును పెంచుకుంటున్నాడు. నిరంతరము దేహమునుగురించే ఆలోచిస్తున్నాడు. అందువల్లనే, అనారోగ్యానికి గురి అవుతున్నాడు. దేహాభిమానమును దూరం గావించే నిమిత్తం రోగములు తనలో ఆవిర్భవించుచున్నవనే సత్యాన్ని తాను గుర్తించి వర్తించడం అత్యవసరం.

srisathyasaivachanamrutam

## తేదీ 05.07.2003, వైద్యుల దినోత్సవం, బృందావనం

ప్రేమస్వరూపులారా! గడచిన ఒక నెలదినముల నుండి నేను మీకు కనిపించ లేదు. దీనికి కారణమేమిటి? ఇది నేను ఒకరి బాధను తీసుకోవడం కాదు; ఈ దేహములో పుట్టినదీ కాదు. యథార్థమైన విషయమును నేనీనాడు మీకు వెలిబుచ్చుచున్నాను.

దేహము పాంచభౌతికము దేహము కూలకతప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ యా
దేహియె దేవదేవుడు మదిన్ గణుతింపగ ఆత్మరూపుడౌ!

మీకు తెలుసు – స్వామియొక్క 'హిప్' (తుంటి) మూడు తుండ్లైపోయింది. 'హిప్' దగ్గర ఉండే 'బాల్' కూడా రెండు తుండ్లైపోయింది. దీనివలన కలిగే బాధ ఎంత తీవ్రమైనదో వర్ణించడానికి వీలుకాదు. కదలడానికి, మెదలడానికి వీలుకాదు. ఒక 'షాకు' మాదిరి కొడుతుంటాది. కాని, నేను లెక్కచేయలేదు. 'దేహాభిమానాన్ని దూరం చేసుకొని ఆత్మాభిమానమును అభివృద్ధిపరచుకోండి,' అని మీకు బోధించే నిమిత్తమై నేనిన్ని అవస్థలకు గురి అయ్యాను. **ఈ దేహం నేను కాదు.** మీరుకూడా దేహాభిమానమును దూరం చేసుకున్నప్పుడు నిరంతరము సుఖశాంతులను అనుభవించగలరు. దేహాభిమానమును విడిచిపెట్టనంతవరకు ఎన్నో కష్టములకు గురికావలసివస్తుంది. ఏమిటీ దేహం? ఇది పాంచభౌతికమైనది.

మలినపు కొంప రోగముల ప్రుగ్గెడు సేవక గంప జాతసం
చలనము పొందు దుంప భవసాగర మీదగలేని కంప అం
బులపొది లెమ్ము చూడ మునమెచ్చు దలంప దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా! హరిపాదము లాశ్రయించవే!

మీరు దైవాభిమానమును అభివృద్ధిపరచుకున్నప్పుడు దేహాభిమానము కించిత్తైనా మీకు బాధ కల్గించదు. దేహాభిమానమును అరికట్టుకోవడమే ఆధ్యాత్మిక సాధనలో ప్రథమ సోపానము. దేహాభిమానమును అభివృద్ధిపరచుకోవడంవల్లనే మీరనేక కష్టములకు గురి అవుతున్నారు. దేహాభిమానము పెరిగేకొలదీ ఆత్మాభిమానము తరిగిపోతుంది.

sri sathyasai vacharamrutam

## తేదీ 05.07.2003, వైద్యుల దినోత్సవం, బృందావనం

ఎట్టివారికైనా కర్మ తప్పిందికాదు. అసలు మానవుడు కర్మచేతనే పుడుతున్నాడు. 'కర్మాను బంధీని మనుష్యలోకే.' కర్మచేత బంధింపబడిన మానవుడు కర్మను ఏవిధంగా తప్పించుకోగలడు? 'కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన,' అని భగవద్గీత బోధిస్తోంది. ప్రతిఫలాపేక్షరహితంగా దేహంతో కర్మలనాచరిస్తూ ఆత్మాభిమానమును పెంచుకోవాలి. అలనాడు పాండవులు కందమూలాదులను భుజిస్తూ కారడవులలో కాలము గడుపవలసివచ్చింది. సాక్షాత్తు ధర్మస్వరూపుడైన ధర్మరాజుకు సహితం కష్టాలు తప్పలేదు. సత్య హరిశ్చంద్రుడంతటివాడు రాజ్యభ్రష్టుడై కాటికాపరి కావలసివచ్చింది. కనుక, ఎంతటివారైనా కర్మను అనుభవించక తప్పదు. అయితే, కర్మను సాధించగల మహత్తరమైన శక్తి మానవునిలోనే ఉన్నది. అటువంటి గొప్ప శక్తి తనయందే ఉండగా మానవుడు బలహీనుడవుతున్నాడంటే, అందుకు కారణం దేహాభిమానమే! ఆత్మాభిమానమును పెంచుకున్నప్పుడు దేహాభిమానము సహజంగానే తరిగి పోతుంది. ఎవరైనా సరే, దేహమును ధరించిన తరువాత కొన్ని బాధలను అనుభవించక తప్పదు. దేహము క్షణంలో పుడుతుంది, క్షణంలో పోతుంది. కనుక, క్రమక్రమేణ దేహాభిమానమును తగ్గించుకోవాలి.

'హిప్' విరిగినప్పుడు నన్ను హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. నేను నవ్వుతూ వెళ్ళాను. అక్కడికి వెళ్ళిన తరువాత అనేకమంది డాక్టర్లు నా చుట్టూ చేరారు. వాళ్ళు బాధపడుతుంటే నేను, 'మీరు బాధపడకండి. నాకేమాత్రము బాధలేదు. ఈ దేహము నాది కాదు. ఇది మీ దేహము. దీనిని మీరేమైనా చేసుకోండి,' అని చెప్పాను. మూడు గంటలైన తరువాత నేను తిరిగి వచ్చాను. నవ్వుతూ, నవ్వుతూ ఉన్నాను. మీరు కూడా కష్టములకు నవ్వుతూ స్వాగతం పలకాలి. అప్పుడే మీరు నిజమైన మోక్షసాధకులు కాగలరు. దేహానికి బాధలు వస్తుంటాయి, వాటిని ఏమాత్రం లెక్కచేయకూడదు. బాధలను అనుభవించడం దేహముయొక్క సహజ ధర్మము. వాటిని మనము ఆత్మబలంతో ఎదుర్కోవాలి. రోగులలో ఇట్టి ధైర్యసాహసాలను నూరిపోసి డాక్టర్లు తగిన ఆదర్శం అందించాలి. ఈనాటి డాక్టర్లు ఎంతో కష్టపడి అనేక రోగాలకు నివారణోపాయములను కనిపెడుతున్నారు. లోకంలో ఎక్కడ చూసినా డాక్టర్లున్నారు. ఇంటికి ఇద్దరు డాక్టర్లుంటే, ఆ ఇంట్లో నల్గురు పేషంట్లుకూడా ఉంటారు! డాక్టర్ల సంఖ్య పెరిగేకొలదీ రోగుల సంఖ్యకూడా పెరిగిపోతున్నది. కోరికలను అదుపులో

srisathyasaivachanamrutam

ఉంచుకోలేక రోగాలను పెంచుకుంటున్నారు.

ఆపరేషను జరిగిన మూడు దినములలోనే నేను నడవడం ప్రారంభించాను. కారణమేమిటి? నాకు దేహాభిమానము ఏమాత్రం లేదు. ఆత్మాభిమానంతో అందరినీ చూసి ఆనందిస్తున్నాను. మీరుకూడా ఈవిధంగా దేహాభిమానమును త్యజించి ఆనందంగా ఉండండి. మీ ఆనందమే నా ఆహారము. మీ ఆనందమే నా ఆరోగ్యము. ఆరోగ్యమంటే ఏమిటి? దేహములో అన్ని అంగములూ సక్రమంగా పని చేస్తున్నప్పుడే మనిషి ఆరోగ్యంగా ఉన్నాడంటారు. ఈ దేహములో అన్ని అంగములూ సక్రమంగా పని చేస్తున్నాయి. ప్రాపంచికమైన, భౌతికమైన దేహము ధరించిన తరువాత ఎవరికైనా కొన్ని ఇబ్బందులు తప్పవు. ఇవి కదలిపోయే మేఘాలవలె వస్తాయి, పోతాయి. వాటిని తట్టుకొని నెట్టుకొని ముందుకు సాగిపోవాలి. Life is a challenge, meet it. Life is a game, play it. ఈ జీవితమును ఒక క్రీడగా భావించి ఆడుకుంటూ రావాలి. నేను ఈవిధంగా ఈ దేహంతో ఆడుకుంటూ వస్తున్నాను. నాకెట్టి బాధలూ లేవు. సాధారణంగా ఎవరికైనా 'హిప్' విరిగితే నొప్పి చాలా తీవ్రంగా ఉంటుంది. అయితే, 'హిప్' విరిగినా, ఏది విరిగినా నాకు మాత్రం కష్టం లేదు. వాటితో నేను 'కనెక్షన్' (సంబంధం) పెట్టుకుంటే కదా నాకు బాధ! ఏ అంగముతోను నేను 'కనెక్షన్' పెట్టుకోలేదు. మీ ప్రేమతోనే 'కనెక్షన్' పెట్టుకున్నాను. మీ ప్రేమను చూసి నేను ఆనందిస్తున్నాను. ఇంత త్వరగా ఇది పూర్తిగా నయం కావడానికి కారణమేమిటి? భక్తుల యొక్క ప్రార్థనలే! ప్రపంచము నలుమూలలా భక్తులు ప్రార్థన చేస్తూ వచ్చారు. ప్రార్థనచేత ఎంతటి గొప్ప శక్తినైనా సాధించవచ్చును. భక్తుల ప్రార్థనలయొక్క ప్రభావమే స్వామి ఇంత త్వరగా ఆరోగ్యాన్ని పొందడానికి మూలకారణమైనది.

ఈనాడు మనము 'డాక్టర్స్ డే'ని జరుపుకోవడంలో గల ఉద్దేశమేమిటి? డాక్టర్లు పేషంట్లకు అన్నివిధాలుగా ఆనందమునందించడానికి తగు దీక్ష పూనాలి. కొందరు డాక్టర్లు స్వార్థమును పూర్తిగా త్యజించి పేషంట్లయొక్క శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నారు. మా డాక్టర్ సుందరేశ్ చాలా శ్రమపడి స్వామిని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటూ వచ్చాడు. 'సుందరేశ్, నేను బాగున్నాను. మీరేమీ బాధ పడకండి,' అని నేను ఎంత చెప్పినా తాను వినేవాడు కాదు. క్షణక్షణమూ వచ్చి, 'స్వామికి ఎట్లా ఉంది? ఎక్కడైనా

sri sathyasai vahamrutam

నొప్పిగా ఉందా?' అని అడుగుతూ ఉండేవాడు. కేవలం స్వామిని మాత్రమే కాదు, ఇతరులను కూడా అతను అదేవిధమైన శ్రద్ధతో చూసుకుంటాడు. మన కాలేజీ విద్యార్థులలో ఒకరికి మోటార్ సైకిల్ యాక్సిడెంట్ జరిగినప్పుడు అతను రాత్రింబవళ్ళు విశ్రాంతి తీసుకోకుండా అనేక పర్యాయములు పుట్టపర్తికి వచ్చి ఆ పేషంటుకు చికిత్స చేశాడు. సుందరేశ్‌వంటి డాక్టర్లు ప్రపంచంలో అన్నిచోట్ల ఉంటే అసలు రోగములే ఉండవు. ఈనాటి డాక్టర్లు స్వార్థంతో డబ్బుకోసం ప్రాకులాడుతున్నారు. అందువల్లనే, దినదినమునకూ రోగాలు పెరిగిపోతున్నాయి.

మరొక చిన్నవిషయం. ఇది జరిగి తొమ్మిది సంవత్సరములైపోయింది. ఒకరోజు నేను తలస్నానం చేసి Hair dryer (కురులను ఆరబెట్టుకోవడానికి ఉపయోగించే సాధనము) పెట్టుకున్నాను. దానిని అమెరికానుండి ఒక డాక్టరు పంపించాడు. అది పెట్టుకున్నప్పుడు కరెంటు లేదు. 'ఏమిటిది పనిచేయడం లేదే,' అనుకొని దానిని దగ్గరగా పట్టుకొని చూస్తుంటే కరెంటు వచ్చింది. తక్షణమే వేడిగాలి సోకి నా కంటిపాప కాలిపోయింది. సరే, పోతే పోయింది; ఒక కన్నుతో ఎంతైనా చూడగలనని సరిపెట్టుకున్నాను. ఈ ప్రపంచాన్ని చూడడానికి అనేక నేత్రములు కావలెనా? అవసరం లేదు. ఒక్క నేత్రముంటే చాలు. 'సహస్ర శీర్షా పురుషః సహస్రాక్షః సహస్ర పాత్.' (భగవంతుడు వేలాది శిరస్సులను, వేలాది నేత్రములను కలిగినవాడు) కనుక, ఈ దేహానికి ఒక కన్ను చాలనుకున్నాను. మొన్న 'హిప్' విరిగిపోయి నేను హాస్పిటల్‌లో చేరినప్పుడు డాక్టర్ హేమంతమూర్తి వచ్చి కంటి ఆపరేషన్ కూడా చేశాడు. అప్పటినుండి నేను రెండు కన్నులతో చూడగల్గుతున్నాను. హేమంతమూర్తివంటి కంటి డాక్టర్లు, సుందరేశ్‌వంటి ఎముకల డాక్టర్లు లోకంలో చాలా అరుదుగా ఉంటారు. అలాంటి డాక్టర్లను ఈనాడు అభివృద్ధిపరచాలి. గవర్నమెంటు తగిన సదుపాయములను కల్పించక పోవడంచేత డాక్టర్లు అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. డాక్టర్లు ఎంత గొప్పవారైనప్పటికీ వారికి తగిన పరికరములు కూడా అత్యవసరము. అలాంటి డాక్టర్లకు మనమెంతైనా చేయూతనిచ్చి తగిన ఉత్సాహప్రోత్సాహముల నందించాలనే ఉద్దేశంతోనే ఈరోజును 'డాక్టర్స్ డే'గా జరుపుకుంటున్నాము. ఈ ప్రపంచమంతయు 'హెల్త్ అండ్ ఎడ్యుకేషన్' పైననే

sri sathyasai vachanamrutam

ఆధారపడియున్నది. 'హెల్త్' బాగున్నప్పుడే 'ఎడ్యుకేషన్' ఉపయోగపడుతుంది.

ప్రేమస్వరూపులారా! మీ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోండి. మీ ఆహార విహారములలో తగు జాగ్రత్త వహించండి. సమాజములో ఎంతోమంది ఎన్నోవిధాలుగా బాధపడుతున్నారు. అలాంటివారికి మీరు తగిన సహాయం చేయండి. అప్పుడే దేశము బాగుపడుతుంది. కాని, ఈనాటి వైద్యుల్లో ఎంతో మంది కేవలం డబ్బుకోసం పాటుపడుతున్నారు. డబ్బు వస్తుంది, పోతుంది. Money comes and goes, but morality comes and grows. కాబట్టి, మీరు నైతికవిలువలను పెంచు కోవాలి. వైద్యవృత్తిని చేపట్టినందుకు మీరు పేషంట్స్‌కు తగిన సహాయం చేయాలి. డబ్బుకోసం ప్రాకులాడకూడదు. ఈనాడు చాలామంది డాక్టర్లు వైద్యము పేరిట వ్యాపారంలో మునిగారు. అలాంటి వైద్యులు మహాపాపులనే చెప్పవచ్చు. పేషంట్స్ యొక్క క్షేమాన్ని కోరేవాడే నిజమైన వైద్యుడు. అలాంటి వైద్యులను మనం తగినరీతిగా ప్రోత్స హించాలి. తద్వారా పేషంట్స్‌కు కూడా ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

నేను పొగడుకోవడం కాదుగాని, నిజంగా మా హాస్పిటల్స్ రోగులకు ఎంతో ఘనమైన సేవ చేస్తున్నాయి. వైట్‌ఫీల్డులో ఉన్నజనరల్ హాస్పిటల్‌కి పోయి చూడండి, అక్కడికి పాపం ఎంతమందో బీదవాళ్లు వచ్చి వైద్యసహాయం పొందుతున్నారు. వాళ్ళకు తినడానికి తిండిలేదు, కట్టడానికి సరియైన బట్టలేదు, ఉండడానికి కొంపలేదు. అలాంటివాళ్ళకు రోగాలు వస్తే వాళ్ళని ఎవరు ఆదుకుంటారు? కనుకనే, మా జనరల్ హాస్పిటల్స్‌లోగాని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లోగాని అంతా ఉచితమే! ఉచితమే! వీటిద్వారా ఎన్నో బీదకుటుంబాల వారు ప్రయోజనం పొందుతున్నారు. ఈనాడు అనేకమంది సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కడుతున్నారుగాని, అక్కడ జరిగేదంతా వ్యాపారమే! పేషంటుయొక్క టెంపరేచరు చూడడానికి కూడా ఫీజు వసూలు చేస్తున్నారు! ఇలాంటి పరిస్థితిలో బీదవాళ్ళ గతి ఏమిటి? కాబట్టి, డాక్టర్లు సాధ్యమైనంతవరకు బీదలకు ఉచితంగా చికిత్స చేయాలి. అప్పుడే వాళ్ళు చదివిన చదువు సార్థకమౌతుంది.

sri sathyasai vachanamrutam

త్యాగభావంతో రోగులకు సేవచేయడమే ముఖ్యమైన సేవ. దానికంటే మించిన సేవ మరొకటి లేదు. 'దిక్కు లేనివారికి దేవుడే దిక్కు' అన్నారు. మానవుడుకూడా దైవస్వరూపుడే! కాబట్టి దీనులకు, దిక్కులేనివారికి తాను కూడా తగినరీతిగా సహాయపడాలి. వైద్యమును వ్యాపారంగా మార్చకూడదు. ఇది హృదయానికి హృదయం ఇచ్చి పుచ్చుకునే ప్రేమతోకూడి ఉండాలి. Heart to heart, love to love. ఇదే ముఖ్యమైనటువంటిది. ఈ సత్యాన్ని గుర్తించి వర్తించేవాడే నిజమైన డాక్టరు. వ్యాపార దృష్టితో వైద్యము చేసేవాడు అసలు డాక్టరే కాదు, అతనే ఒక పెద్ద పేషంటు! త్యాగభావముతో సేవచేయడమే నిజమైన వైద్యుని లక్షణం.

ఇక్కడున్నటువంటి డాక్టర్లందరూ చాలా గొప్ప త్యాగవంతులు. ఇక్కడి జనరల్ హాస్పిటల్‌లోకూడను డాక్టర్ సావిత్రి మొదలైనవారు రాత్రింబవళ్ళు పని చేస్తున్నారు. నేనెన్నో పర్యాయములు చెబుతుంటాను, "ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటే మీరు రోగులకు ఎలా సేవ చేయగలరు? మీరు బాగున్నప్పుడే రోగులను బాగా చూసుకోవడానికి వీలౌతుంది. కాబట్టి, మొట్టమొదట 'సెల్ఫ్' చూసుకోండి, తరువాత 'హెల్ప్' చేయండి." ప్రతి వ్యక్తీ మొట్టమొదట తన 'హెల్త్'ను కాపాడుకోవాలి. 'హెల్త్' చెడిపోతే ఏ పనీ చేయడానికి వీలుకాదు.

మా ప్రిన్సిపాల్ తన ప్రసంగంలో చెప్పాడు, "వైద్యో నారాయణో హరిః" నిజంగా వైద్యుడు నారాయణ స్వరూపుడే! నారాయణుడు నిరంతరము పరోపకారమునందు నిమగ్నుడై ఉంటాడు. కాబట్టి, వైద్యుడుకూడా సర్వులకు సహాయం చేయాలి. 'పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనం' అన్నారు. కాబట్టి, తోటి వ్యక్తులకు మీ చేతనైనంత సహాయం చేస్తూ రావాలి. పుట్టపర్తి, బెంగుళూరు, ముద్దెనహళ్ళి, అళికె... ఇంకా అనేకచోట్ల మేము హాస్పిటల్స్ కట్టాము. ఆయా హాస్పిటల్స్‌లో పనిచేసే డాక్టర్లను చూస్తే నాకెంతో ఆనందంగా ఉంటుంది. అళికెలో ఇటీవలే ఒక హాస్పిటల్‌ను ప్రారంభించాము. అక్కడ ఎంతోమంది బీదపేషంట్లు ఆనందిస్తున్నారు. అది చూస్తే నాకెంతో సంతోషంగా ఉంది. ఆ సంతోషమే నాకు బలాన్ని అందిస్తోంది. ఆవిధమైన సేవలు చేసి మీరు భగవదనుగ్రహానికి పాత్రులు కండి. The best way to love God is to serve God. ప్రేమ, సేవ... ఈ రెండింటివల్లనే మీ జన్మ సార్థకమౌతుంది.



sri sathyasai vahini amrutam

పుట్టపర్తిలోను, బెంగుళూరులోను మన జనరల్ హాస్పిటల్స్ ఉన్నాయి. ఈ హాస్పిటల్స్‌లో ఎంతో ఆశ్చర్యము కలిగించేవిధంగా వైద్యసేవలు జరుగుతున్నాయి. ఆ పేషంట్లు పొందుతున్న ఆనందమే నాకు చక్కని ఆరోగ్యాన్ని అందిస్తోంది. స్వామి ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే మీరు పేషంట్లను మంచిగా చూడాలి. పేషంట్లకు సేవ చేయాలి. అదే దైవసేవ. దానికంటే మించిన సేవ లేదు. 'డాక్టర్స్ డే' అంటే, డాక్టర్లు గొప్పగా డ్రస్సులు వేసుకుని వస్తే సరిపోదు; సేవలలో పాల్గొనాలి. మీకు తెలుసు – ఇక్కడి జనరల్ హాస్పిటల్‌లో డా॥ సావిత్రి మరియు డా॥ శాంత చాలా గొప్పసేవ చేస్తున్నారు. ఇంతేకాదు. బెంగళూరు సిటీనుండి అనేకమంది డాక్టర్లు వచ్చి ఇక్కడి జనరల్ హాస్పిటల్‌లో ఎంతో గొప్ప సేవ చేస్తున్నారు.

(తేదీ 05.07.2003, వైద్యుల దినోత్సవం, బృందావనం)

sri sathyasai vachanamrutam